సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

7

శనివారం | 19 | ఆగస్టు | 2023


భద్రకాళి అమ్మవారు


త్రిశక్తి స్వరూపిణిగా రుద్రేశ్వరస్వామికి అలంకరణ


రాజరాజేశ్వరి దేవాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేస్తున్న మహిళలు


భద్రకాళి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రావణం సందడి

శ్రావణమాసం తొలి శుక్రవారం నగరంలోని భద్రకాళి దేవాలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. మహిళలు అమ్మవారికి దీపాలు సమర్పించి కుంకుమపూజలు, చీరసారెలతో ఒడిబాలబియ్యం సమర్పించారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అదేవిధంగా వరంగల్ రాజరాజేశ్వరి దేవాలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వేయిస్తంభాల ఆలయంలో రుద్రేశ్వరస్వామిని త్రిశక్తి స్వరూపిణిగా అలంకరించి పూజలు జరిపారు. ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో అర్చకులు స్వామివారికి రుద్రాభిషేకాలు, సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. - హన్మకొండ కల్చరల్

దరఖాస్తుల రికార్డ్

వరంగల్ అర్బన్‌లో 65 దుకాణాలకు 6,002 దరఖాస్తులు

- ఈ నెల 4 నుంచి 18వ తేదీ వరకు స్వీకరణ
- రింగ్ మాస్టర్లు వందల సంఖ్యలో వేసిన వైనం
- అధికంగా ధర్మసాగర్ వైన్స్‌కు 152 అప్లికేషన్లు..
- శ్రావణమాసం తొలి శుక్రవారంతో తరలివచ్చిన మహిళలు
- 21న లక్కీ డ్రా ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు


హనుమకొండలో దరఖాస్తులు సమర్పిస్తున్న మద్యం వ్యాపారులు

కాజీపేట అర్బన్: వరంగల్ అర్బన్ జిల్లాలోని 65 వైన్‌షాపులకు టెండర్ల దరఖాస్తు ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. 14 రోజులపాటు దరఖాస్తులు స్వీకరించారు. 2021-23లో 2,983 దరఖాస్తులతో రూ.59 కోట్ల ఆదాయం రాగా.. 2023-25లో 6,002 (శుక్రవారం రాత్రి 12 గంటల వరకు అందిన సమాచారం ప్రకారం) దరఖాస్తులకు గాను రూ.120 కోట్ల ఆదాయంతో గత ఏడాది రికార్డును బ్రేక్ చేసింది. ప్రభుత్వ ఖజానాకు ఆదాయపు కిక్కు అందజేసింది. నవంబర్‌లో 2021-23 టెండర్ల గడువు ముగి యనుండగా మూడు నెలలకు ముందే 2023-25 టెండర్ల ప్రక్రియను అబ్కారీ శాఖ ప్రారంభించింది. ఇందుకు తగ్గట్టుగానే దరఖాస్తుల తాకిడి కొనసాగింది. హనుమకొండ కలెక్టరేట్‌లోని సెల్లార్‌లో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టి దరఖాస్తులు స్వీకరించారు. ఈ నెల 4వ తేదీ నుంచి శుక్రవారం వరకు టెండర్ల దరఖాస్తు ప్రక్రియ కొనసాగింది.

రియల్ టు వైన్స్..

ఇటీవల రియల్ భూం తగ్గడంతో ఆ రంగంలో పెట్టుబడులు పెట్టే రియల్టర్లు ప్రత్యామ్నాయంగా వైన్స్ వైపు మళ్లారు. రెండేళ్ల గడువుతో వైన్స్ దక్కించుకుంటే పక్కా ఇన్‌కం అని భావించి దరఖాస్తులతో పోటీ పడ్డారు. దీనికితోడు మూడు నెలల ముందే వైన్స్ టెండర్లకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టడం డిసెంబర్‌లో ఎన్నికలు ఉండడమే ప్రధాన కారణంగా స్పష్టమైంది. ఎన్నికల్లో ఆదాయం భారీగా దండుకోవచ్చన్న ఆలోచనతో వైన్స్ టెండర్ దరఖాస్తులు భారీ ఎత్తున వచ్చినట్లు భావిస్తున్నారు.

రింగ్ మాస్టర్లు..

జిల్లాలో అత్యధికంగా మద్యం విక్రయాలు కొనసాగే షాపులను ఎంచుకుని 10 నుంచి 20 మంది టీంగా ఏర్పడి వందకు పైగా దరఖాస్తులు సమర్పించారు. రింగ్‌మాస్టర్లుగా వారికి తప్ప వేరే వారికి దుకాణం రాకుండా పకడ్బందీ ప్లాన్ రూపొందించుకున్నారు. జిల్లాలోని ధర్మసాగర్ వైన్స్‌కు 152, హంటర్‌రోడ్డులోని ఓ వైన్స్‌కు 136 దరఖాస్తులు రావడమే ఇందుకు నిదర్శనం.

శ్రావణ మాసం.. మహిళలు

శ్రావణ తొలి శుక్రవారం వైన్స్ టెండర్లను దక్కించుకునేందుకు ముహూర్తం ఫిక్స్ చేసుకున్న కొందరు వ్యాపారులు.. మహిళలతో దరఖాస్తులు వేయించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 10శాతం దరఖాస్తులను మహిళలు అందజేయడం గమనార్హం.

21న లక్కీ డ్రా...

హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో 21వ తేదీన జిల్లాలోని 65 వైన్‌షాపులకు లక్కీ డ్రా నిర్వహించనున్నారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని లక్కీ డ్రా ద్వారా వైన్‌షాపులను ప్రకటిస్తారు.

గత, ప్రస్తుత ఏడాది దరఖాస్తులు, ఆదాయం ఇలా.. (రూ.కోట్లలో)

ఏడాది	దరఖాస్తులు	ఆదాయం
2021-23	2,983	59
2023-25	6,002	120




వరంగల్ రూరల్ జిల్లా ఎక్సైజ్ పరిధిలో..


కరీమాబాద్ : వరంగల్ రూరల్ జిల్లా ఎక్సైజ్ పరిధిలోని మద్యం దుకాణాలకు దరఖాస్తులు వెల్లువెత్తాయి. వర్ధన్నపేట, నర్సంపేట, పరకాల ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలోని 63 దుకాణాలకు గతంతో పోలిస్తే ఈ ఏడాది రెట్టింపు దరఖాస్తులు వచ్చాయి. అప్పుడు 1,793 దరఖాస్తులు రాగా.. ఇప్పుడు 2,937వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వానికి రూ.58.74 కోట్ల ఆదాయం సమకూరింది.

దరఖాస్తులు ఇలా..

తేదీ	దరఖాస్తులు
4	1
5	8
7	13
8	19
9	11
10	60
11	223
12	322
14	743
16	493
17	1,516
18	2,593


దరఖాస్తులు సమర్పించేందుకు వచ్చిన మహిళలు

ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ల ద్వారా అవగాహన



వైన్‌షాపుల దరఖాస్తుల స్వీకరణకు కలెక్టరేట్‌లోని సెల్లార్‌లో ఆరు హెల్ప్‌డెస్క్‌లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశాం. అప్లికేషన్ ఫీజు డీడీ, చలాన్ తీసే ప్రక్రియ, దరఖాస్తులను పూర్తి చేసే విధానంపై అవగాహన కల్పించాం. ఈఏడాది అధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. ఈనెల 21న అంబేడ్కర్ భవన్‌లో లక్కీ డ్రా నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం.

- చంద్రశేఖర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్

న్యూస్‌రీల్

ముగిసిన స్పోర్ట్స్ హాస్టల్ ప్రవేశ ఎంపికలు



వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండ్రోజుల పాటు నిర్వహించిన రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో ప్రవేశానికి ఎంపికలు శుక్రవారం ముగిశాయి. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈఎంపిక పరీక్షలో రెండో రోజు 41 మంది బాలురు, 11 మంది బాలికలు హాజరైనట్లు డీవైఎస్‌ఓ జి.అశోక్ తెలిపారు. సీట్ల లభ్యత ఆధారంగా ప్రతిభ కనబర్చిన బాలబాలికలకు ప్రవేశం కల్పించనున్నట్లు సాట్ పరిశీలకుడు అలెగ్జాండర్ ఫ్రాన్సిస్ తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌ఏ కోచ్‌లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యాధికారులకు పాలియేటివ్ కేర్‌పై శిక్షణ

ఎంజీఎం: హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాల వైద్యాధికారులకు శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో పాలియేటివ్ శిక్షణ నిర్వహించారు. ఇందులో డీఎంహెచ్‌ఓ సాంబశివరావు మాట్లాడుతూ.. ప్రతీ ఐదు వేల జనాభాకు హెల్త్‌అండ్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేసి వైద్యాధికారులను నియమించినట్లు తెలిపారు. ఈవైద్యాధికారులు తమ పరిధిలోని గృహ సందర్శన ద్వారా పాలియేటివ్ కేర్ రోగులను గుర్తించి చికిత్సలు అందించాలన్నారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి ఉమశ్రీ మాట్లాడుతూ.. సమాజంలో అసంక్రమిత వ్యాధులు పెరుగుతున్నాయని, వీటిని అరికట్టడంలో హెల్త్ అండ్ వెల్‌నెస్ వైద్యాధికారులు ముఖ్య భూమిక పోషించాలన్నారు.

19 మంది డీబార్

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో శుక్రవారం నిర్వహించిన డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ కోర్సుల్లో మూడో సంవత్సరం పరీక్షల్లో ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాల్లో కాపీయింగ్ చేస్తూ.. స్క్వాడ్లకు పట్టుబడి 19 మంది విద్యార్థులు డీబార్ అయినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఏ.నరేందర్ తెలిపారు. 3,900 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. అందులో 3,021 మంది హాజరయ్యారని, 879 మంది గైర్హాజరైనట్లు వారు తెలిపారు.

28 మందికి 'కారుణ్య' ఉద్యోగాలు

హన్మకొండ అర్బన్: జిల్లాలో జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు అర్హత ఉన్న 28 మందికి శుక్రవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్ కౌన్సెలింగ్ నిర్వహించారు. సూపర్ న్యూమరీ ద్వారా ఏర్పాటు చేసిన 4 శాఖల్లోని 28 పోస్టులకు వారిని ఎంపిక చేశారు. శనివారం నియామక ఉత్తర్వులు అందజేయనున్నారు.

కుష్టుపై అపోహలు వద్దు



హనుమకొండ: కుష్టు వ్యాధిపై మూఢ నమ్మకాలు, అపోహలు వద్దని ఆరంభ దశలోనే గుర్తించి, సరైన చికిత్స అందించడం ద్వారా అంగవైకల్యం రాకుండా నివారించవచ్చని బుల్లితెర హాస్య నటుడు జబర్దస్త్ వెంకీ అన్నారు. కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వేలెన్స్ ఎల్‌సీడీసీ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం హనుమకొండ డీఎంహెచ్‌ఓ ఆధ్వర్యంలో కేయూ చౌరస్తా నుంచి లష్కర్ సింగారం యూపీహెచ్‌సీ వరకు కుష్టు వ్యాధిపై నిర్వహించిన అవగాహన ర్యాలీని డీఎంహెచ్‌ఓ బి.సాంబశివరావుతో కలిసి వెంకీ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ మదన్‌మోహన్, ఎస్‌సీడీ పీఓ ఉమశ్రీ, డాక్టర్ సౌజన్య, మాస్ మీడియా ఆఫీసర్ కె.ప్రసాద్, డీహెచ్‌ఈఓ సందేల శ్రీనివాస్, వైద్యాధికారులు, యూపీహెచ్‌సీల వైద్యులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'తూర్పు'లో పొలిటికల్ హీట్

బీఆర్‌ఎస్ అభ్యర్థిత్వంపై కొనసాగుతున్న ఉత్కంఠ

- దాదాపు సిట్టింగ్‌కు అనుమానమే!
- అయినా అధిష్టానం ముందు ప్రయత్నం
- ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సైతం
- తనకే అవకాశం ఇవ్వాలని మేయర్ సుధారాణి యత్నాలు
- సీఎం నిర్ణయానికి వేచి ఉన్న గులాబీ శ్రేణులు



సాక్షి, వరంగల్: వరంగల్ తూర్పు పొలిటికల్ హీట్ రాష్ట్ర రాజధానికి చేరింది. అసెంబ్లీకి పోటీ చేసే బీఆర్‌ఎస్ అభ్యర్థుల జాబితా సిద్ధమైందన్న నేపథ్యంలో సిట్టింగ్ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌కు టికెట్ కష్టమేనన్న ప్రచారంతో.. అసలు బీఆర్‌ఎస్ నుంచి ఎవరి అభ్యర్థిత్వం ఖరారవుతుందన్న దానిపై జోరుగా ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యతో పాటు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి పేర్లు బీఆర్‌ఎస్‌లో ప్రచారంలో ఉన్నాయి. చివరి వరకు ఎవరి పేరు ఖరారవుతుందోనన్న ఉత్కంఠ గులాబీ శ్రేణుల్లో ఉంది. తనకే మళ్లీ అవకాశం ఇస్తారని ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌తో పాటు ఆయన అనుచరులు సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్నా.. అలాంటిదేమీలేదని, తమకే ఈసారి టికెట్ వస్తుందని ఇతర నేతలు జోరుగా లాబీయింగ్ చేస్తున్నారు. ఈక్రమంలో ఆశావహులు సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావును ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. టికెట్ విషయంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అభిప్రాయాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని ముందుకు వెళ్లాలని అధిష్టానం భావిస్తోంది. ఈతరుణంలో ఆయన నిర్ణయం కూడా ఎలా ఉంటుందోనని అందరూ ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

మాకే ఎందుకివ్వాలంటే..

ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య గతంలో కాంగ్రెస్ నుంచి ఇక్కడ ఎమ్మెల్యేగా గెలిచారు. ఇక్కడి ప్రజల్లో ఆయనకు మంచి పట్టు కూడా ఉంది. వివాదరహితుడిగా పేరుండడంతో ఈయన పేరును కూడా సీఎం కేసీఆర్ లెక్కలోకి తీసుకున్నారనే ప్రచారం ఉంది. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మున్నూరుకాపు కావడంతో ఇక్కడి ఓటర్లను ఈజీగా ప్రసన్నం చేసుకోవచ్చని, అందరూ తమ వారేనని అధిష్టానానికి లెక్కలతో సహా చెబుతున్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన వద్దిరాజు రవిచంద్రకు భారీగా ఓట్లు రావడం కూడా బీఆర్‌ఎస్ అధిష్టానం పరిగణనలోకి తీసుకున్నట్లుగా తెలుస్తోంది. ఇక మేయర్ గుండు సుధారాణి సామాజిక ఓటర్లు కూడా ఎక్కువగా ఉండడం, అందులో మహిళా నేత కావడం కూడా ఆమెకు కలిసొచ్చే అంశమని సుధారాణి అనుయాయులు అంటున్నారు. గతంలో మాదిరిగానే ఈసారి కూడా వరంగల్ తూర్పు అభ్యర్థిని తప్పకుండా మారుస్తారని, పాత సెంటిమెంట్‌ను కేసీఆర్ పునరావృతం చేస్తారన్న చర్చ గులాబీ శ్రేణుల్లో జోరుగా సాగుతోంది. ఏదేమైనా ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లాలో స్టేషన్ ఘన్‌పూర్, జనగామ మాదిరిగానే ఇక్కడ కూడా మార్పు ఉంటుందనే దానిపై త్వరలోనే స్పష్టత వస్తుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

అందరికీ ఆదర్శం సర్దార్ పాపన్న

జయంతి వేడుకల్లో చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్

హన్మకొండ అర్బన్: సర్దార్ సర్వాయి పాపన్న అత్యంత ధైర్య సాహసాలతో పోరాడిన యోధుడని, ఆయన అందరికీ ఆదర్శం అని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. శుక్రవారం పాపన్నగౌడ్ జయంతి వేడుకను కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి చీఫ్ విప్‌తోపాటు కలెక్టర్ సిక్తా పట్నాయక్, కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, 'కుడా' చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ పాల్గొని పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు పాపన్న అన్నారు. ఆయన జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని గుర్తు చేశారు. కుల వృత్తులు కనుమరుగవ్వకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తెలంగాణ చారిత్రక వీరుల గాథల్ని పుస్తక రూపంలో తీసుకురానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, బీసీ డీడీ రాంరెడ్డి, గౌడ సంఘం నాయకులు వెంకటనారాయణగౌడ్, జనగామ శ్రీనివాస్, లక్ష్మణ్‌గౌడ్, వెంకట్రాజం గౌడ్, గోపీగౌడ్ ఉన్నారు.


పాపన్న చిత్రపటం వద్ద జ్యోతి వెలిగిస్తున్న వినయ్‌భాస్కర్, పక్కన కలెక్టర్, ఇతర ప్రతినిధులు

పనుల పురోగతిపై సమీక్ష

గ్రేటర్‌లో జరుగుతున్న స్మార్ట్‌సిటీ, కాళోజీ కళాక్షేత్రం పనుల్లో అధికారులు వేగం పెంచాలని, వరద వల్ల దెబ్బతిన్న సీసీ రోడ్లు వెంటనే కొత్తగా వేయాలని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మున్సిపల్, కుడా పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో రోడ్లు, డ్రెయిన్ల పనుల్లో వేగం పెంచాలని, వరద ముంపు ప్రాంతాల్లో స్వయంగా పర్యటించాలని అధికారులను ఆదేశించారు. ఇందులో గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పథకాల అమలులో వేగం పెంచాలి

ప్రభుత్వ పథకాల అమలులో వేగం పెంచాలని, జిల్లా అధికారులు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో, సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఆమె సమీక్షించారు. గృహలక్ష్మి, బీసీలకు రుణం, జీఓ 58, 59 అమలు వంటి ప్రభుత్వ పథకాల అమలుపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈవీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి కలెక్టర్ సిక్తాపట్నాయక్, కమిషనర్ బాషా, అధికారులు పాల్గొన్నారు.

మూడోసారి అధికారం బీఆర్‌ఎస్‌దే

రాష్ట్ర మంత్రి దయాకర్‌రావు

హసన్‌పర్తి: వరుసగా మూడోసారి బీఆర్‌ఎస్ పార్టీదే అధికారమని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. వరంగల్ నగరంలోని సీఎస్‌ఆర్ గార్డెన్‌లో శుక్రవారం జరిగిన బీఆర్‌ఎస్ వర్ధన్నపేట నియోజకవర్గ స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రజలు బీఆర్‌ఎస్‌కే పట్టం కట్టాలని చూస్తున్నారన్నారు. ఈసారి అరూరి రమేశ్‌ను లక్ష మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో పైలెట్ గ్రామాలుగా ఎంపిక చేసి దళితబంధు పథకాన్ని మంజూరు చేసినట్లు చెప్పారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, జెడ్పీ వైస్ చైర్మన్ శ్రీరాములు, కార్పొరేటర్లు సునీల్‌కుమార్, నాగేశ్వర్‌రావు, దివ్యారాణి, రైతుబంధు సమితి జిల్లా కో-ఆర్డినేటర్ ఎల్లావుల లలితా యాదవ్, డివిజన్ అధ్యక్షులు శ్రీధర్, మణీందర్, వెంకటేశ్వర్‌రెడ్డి, అటికం రవీందర్, జంగా కుమార్, రాజు, పీఏసీఎస్ చైర్మన్‌లు ఉదయ్‌రెడ్డి, రాజేశ్, గోపాల్‌రెడ్డి, జక్కు రమేశ్, రజనీకుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు, పక్కన ఎమ్మెల్యే రమేశ్ తదితరులు

సర్వాయి పాపన్నను ఆదర్శంగా తీసుకోవాలి

వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్ : సర్దార్ సర్వాయి పాపన్నను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం పాపన్న జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి ఆమె మాట్లాడారు. పాపన్న కులవృత్తులను ప్రోత్సహించేవారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీవత్స, డీఆర్‌డీఏ పీడీ సంపత్‌రావు, డీఎస్‌డీఓ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలను పూర్తిచేయాలి : వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి

రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా సత్వరమే పూర్తిచేయాని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో శుక్రవారం వివిధ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ఈనెల 26న జిల్లాలో 3 లక్షల మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్రీవత్స, అశ్విని తానాజీ పాల్గొన్నారు.


పాపన్న జయంతిలో పాల్గొన్న కలెక్టర్ ప్రావీణ్య

భద్రకాళి ఆలయ ఈఓకు పదోన్నతి


శేషుభారతిని సత్కరిస్తున్న సిబ్బంది, అర్చకులు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయ కార్యనిర్వహణాధికారి కె.శేషుభారతి రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతి పొందారు. ఈసందర్భంగా ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్‌భాస్కర్ అభినందనలు తెలిపారు. అనంతరం దేవాలయ కార్యాలయంలో అర్చకులు, సిబ్బంది శేషుభారతి దంపతులను సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్, అర్చకులు భద్రకాళి శేషు, చెప్పెల నాగరాజుశర్మ, సిబ్బంది కూచన హరినాథ్, చింత శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

ట్యాక్స్ ఆఫీసర్ రిలీవ్

వరంగల్ అర్బన్: గ్రేటర్ కాజీపేట డిప్యూటీ కమిషనర్‌గా పని చేస్తూ తాజాగా ట్యాక్స్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టిన జోనాను పురపాలక శాఖ ఉన్నతాధికారులు బదిలీ చేశారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మున్సిపల్ కమిషనర్‌గా జోనాను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయన శుక్రవారం ట్యాక్స్ ఆఫీసర్‌గా రిలీవ్ అయ్యారు.

ఉచిత శిక్షణను వినియోగించుకోవాలి

హన్మకొండ అర్బన్: సెట్విన్, తెలంగాణ భవన నిర్మాణ శాఖ సంయుక్తంగా యువతలో నైపుణ్యాల అభివృద్ధి కోసం స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టిందని, ఈకార్యక్రమం ద్వారా అనేక రంగాల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు, వాటిని వినియోగించుకోవాలని ఉమ్మడి వరంగల్ జిల్లా డిప్యూటీ లేబర్ కమిషనర్ డాక్టర్ శామ్యూల్‌జాన్ అన్నారు. శుక్రవారం వరంగల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో హనుమకొండ, వరంగల్ జిల్లాల యువతను శిక్షణకు ఎంపిక చేయడానికి, ఉపాధి కల్పనకు ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జాన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో తొలిసారిగా ఈవిధమైన కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమానికి 17 కంపెనీలు ముందుకొచ్చాయని, 26 రకాల సాంకేతిక కోర్సుల్లో యువతకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మొత్తం 265 మంది అభ్యర్థులు హాజరు కాగా.. వారిలో 94 మందిని ఎంపిక చేసి నియామక పత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ నాగేశ్వర్‌రావు, సాదిక్, సూరిబాబు తదితరులు ఉన్నారు.


నియామక పత్రాలు పొందిన అభ్యర్థులు

ఆర్టీసీ ఐటీఐలో మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోవాలి

హన్మకొండ: టీఎస్ ఆర్టీసీ ఐటీఐలో మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మోహన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే రెండు విడతల్లో ప్రవేశాలు భర్తీ చేశామని, మిగిలిన సీట్లకు మూడో విడత ప్రక్రియ మొదలు పెట్టినట్లు పేర్కొన్నారు. అర్హులైన ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉచిత రిజిస్ట్రేషన్ కోసం వరంగల్ ములుగు రోడ్డులోని ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీలోని ఆర్టీసీ ఐటీఐలో సంప్రదించాలని కోరారు. డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, పెయింటర్, వెల్డర్ ట్రేడ్‌లలో ఖాళీలున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 98494 25319, 80081 36611 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆదుకోండి.. అప్పు చేసి ఇళ్లు కొన్నాం


కలెక్టర్, కమిషనర్‌తో మాట్లాడుతున్న బాధితులు

హసన్‌పర్తి: నాలాల విస్తరణ వల్ల కుటుంబాలతో సహా రోడ్డున పడుతున్నామని, తమను ఆదుకోవాలని బాధితులు కోరారు. శుక్రవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్, నగర కమిషనర్ రిజ్వాన్ బాషాను కలిసి వినతి పత్రం అందించారు. అన్ని అనుమతులు తీసుకోవడమే కాకుండా, పర్మిషన్లు ఉన్న ఇళ్లను కొనుగోలు చేసినట్లు బాధితులు తెలిపారు. కొంత మంది అప్పులు చేయగా.. మరికొంత మంది బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నట్లు అధికారులకు వివరించారు. వడ్డేపల్లి తూము నుంచి వంద ఫీట్ల రోడ్డు శ్యామల గార్డెన్ వరకు డక్ట్ డ్రెయిన్ నిర్మాణం చేపడితే వరద ముంపు సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందని, ఈఅంశాన్ని పరిగణనలోకి తీసుకుని చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఉన్న నిర్మాణాలకు ఎలాంటి నష్టం కలిగించొద్దని కోర్టు ఉత్తర్వులను కలెక్టర్, కమిషనర్‌కు అందించారు. కార్యక్రమంలో వరద నివారణ సాధన సమితి అధ్యక్షుడు బానోతు నవీన్ కుమార్, కార్యదర్శి గడ్డం రాజ్‌కుమార్, కార్యదర్శులు మానుపాటి రవీందర్, విజేందర్, సభ్యులు సతీశ్, శ్రీనివాస్, పయాజుద్దీన్, గౌస్ పాల్గొన్నారు.

గోవిందరాజుల గుట్ట స్థలం పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ, అధికారులు

వరంగల్ చౌరస్తా: నగర నడిబొడ్డున ఉన్న గోవిందరాజుల గుట్ట ఆలయ భూములను ఆక్రమణల నుంచి కాపాడేందుకు అడుగులు పడుతున్నాయి. ఇటీవల సర్వే నంబర్ 15/1 సుమారు 1,000 గజాల స్థలాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ ఆర్డీఓ వాసు చంద్ర, దేవాదాయ శాఖ ఏడీ ధన్‌రాజ్, అసిస్టెంట్ కమిషనర్ సునీత, బల్దియా ఏసీపీ ఖలీలొద్దీన్, స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్ తదితరులు శుక్రవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆలయ సమీపంలో ఉన్న ఆర్టీసీ బస్‌స్టేషన్, పాత సైకిల్ స్టాండ్ ప్రాంతాలను పర్యవేక్షించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎవరికైనా అపోహలుంటే తిరిగి సర్వే చేయించి వాస్తవాలను నివృత్తి చేస్తామని పేర్కొన్నారు. ఆలయ భూమి గజం కూడా వదిలే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ ప్రతినిధులు చింతాకుల సునీల్, ఖాల్ నాయక్, రాజ్ కుమార్, ఆదినారాయణ, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



48వ వసంతంలోకి..

అర్ధశతాబ్దానికి చేరువలో కాకతీయ యూనివర్సిటీ

- న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్‌తో జోష్
- వేధిస్తున్న అధ్యాపకుల కొరత
- నేడు కేయూ ఆవిర్భావ దినోత్సవం


కేయూ పరిపాలనభవనం


తాటికొండ రమేష్, వీసీ

కేయూ క్యాంపస్: రాష్ట్రంలో ఉస్మానియా విశ్వ విద్యాలయం తర్వాత అంతటి ప్రతిష్ట కలిగినది కాకతీయ యూనివర్సిటీ.. ఉస్మానియా యూనివర్సిటీ పీజీ సెంటర్‌గా ప్రారంభమై 1976 ఆగస్టు 19న కాకతీయ యూనివర్సిటీగా ఆవిర్భవించిన కేయూ.. నేటితో 48వ వసంతంలోకి అడుగిడుతోన్న సందర్భంగా ప్రత్యేక కథనం.

- నాలుగు విభాగాల పీజీ కోర్సులతో ప్రారంభమైన కేయూ ప్రస్తుతం 28 విభాగాలతో కొనసాగుతుంది. కేయూ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, అదిలాబాద్, కరీంనగర్ జిల్లాలు ఉండగా శాతవాహన యూనివర్సిటీ ఏర్పాటు తర్వాత మూడు ఉమ్మడి జిల్లాలతో కొనసాగుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్, అటానమస్ డిగ్రీ కళాశాలలు 287వరకు ఉండగా పీజీ కళాశాలలు 74, ఇంజనీరింగ్ 6, ఫార్మసీ 25, ఎడ్యుకేషన్ 41, ఫిజికల్ ఎడ్యుకేషన్ 3, లా కళాశాలు 3, ఎంబీఏ 24, ఎంసీఏ 7, హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలు 3 ఉన్నాయి.
- యూనివర్సిటీలో అన్ని విభాగాలు కలిపి 409 అధ్యాపకుల (అసిస్టెంట్, అసోసియేట్, ప్రొఫెసర్ల) పోస్టుల మంజూరు ఉండగా ప్రస్తుతం 86 మంది అధ్యాపకులే ఉన్నారు.
- రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీకి 136 పోస్టులు మంజూరు చేసినా ఇప్పటివరకూ నియమించలేదు.
- యూనివర్సిటీలో సుమారు 180వరకు కాంట్రాక్టు లెక్చరర్లు, 200లకుపైగా పార్ట్‌టైం లెక్చరర్లు పనిచేస్తున్నారు.
- యూనివర్సిటీలో నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పలుమార్లు ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేశారు.
- వీసీ రమేష్ తన ఇష్టారాజ్యంగా పాలన కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.
- కేయూలో రెండు మూడు పరిపాలనా పదవులను ఒకరే నిర్వర్తిస్తున్నారు.
- ఉద్యోగుల సమస్యలపై ఆందోళనలు చేస్తే షోకాజ్ నోటీసులు, బదిలీలు చేస్తుండడం వివాదాలకు తావిస్తుంది.
- యూనివర్సిటీలో వివిధ కోర్సుల్లో భారీగా ఫీజుల పెంపుపై విద్యార్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నేడు న్యాక్ సక్సెస్ మీట్

నేడు యూనివర్సిటీ 48 ఆవిర్భావ దినోత్సవ వేడుకలతోపాటు, న్యాక్ ఏ ప్లస్ సాధించిన నేపథ్యంలో సక్సెస్ సెలబ్రేషన్స్‌ను నిర్వహించనున్నారు. తెలిసింది. ఉదయం 11 గంటలకు కేయూ సెనెట్‌హాల్‌లో జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీసీ ఆచార్య తాటికొండ రమేష్, ఉపన్యాసకులుగా న్యాక్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీఎస్ ప్రసాద్ పాల్గొంటారు.

- యూనివర్సిటీ భూమిలోనే ఓ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఇళ్లతోపాటు మరోఇద్దరు ఉద్యోగుల ఇళ్లు కలిసి 13మందివి ఉన్నా.. వారిపై చర్యలు తీసుకోలేకపోతున్నారు.
- న్యాక్ కోసం క్యాంపస్‌లో రూ.10 కోట్ల వ్యయంతో అభివృద్ధి, మరమ్మతులు, సుందరీకరణ పనులు చేశారు. ఇటీవల కేయూ న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించింది.
- యూనివర్సిటీలో కే హబ్, మహిళలకు మరో వసతి గృహం నిర్మాణాలు పూర్తికావచ్చాయి.

భవన నిర్మాణ కార్మికులకు శిక్షణ

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ రెడ్డిపాలెం (మొగిలిచర్ల) రైతు వేదిక స్థలంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) ద్వారా అర్హులకు భవన నిర్మాణాలపై ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఏర్పాటు చేసినట్లు న్యాక్ ట్రైనింగ్ సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్ పి.అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 18–45 ఏళ్ల లోపు వారికి మేషన్/బిల్డింగ్ వర్క్‌లో 15 , మార్బుల్ అండ్ గ్రానైట్ టైల్ ఫ్లోరింగ్‌లో 15, ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్‌లో 15 రోజులపాటు శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ సమయంలో మధ్యాహ్న భోజనం, యూనిఫాం, సేఫ్టీ హెల్మెట్, స్టేషనరీ ఉచితంగా ఇవ్వడంతోపాటు స్టైఫండ్ కింద రూ.4,500 ఇస్తామని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు లేబర్‌కార్డు, ఆధార్, రేషన్ కార్డు జిరాక్సు ప్రతులు, బ్యాంకు ఖాతా నంబర్, 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో రెడ్డిపాలెం రైతు వేదిక ట్రైనింగ్ సెంటర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు. సెంటర్ ఇన్‌చార్జ్‌గా డి.ప్రసాద్‌ను నియమించినట్లు ఏడీ తెలిపారు.

హెల్త్ మేళాలు నిర్వహించాలి


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ వెంకటరమణ

గీసుకొండ : జిల్లాలోని పల్లె దవాఖానల్లో ఎంఎల్‌హెచ్‌పీలు, స్టాఫ్‌నర్సులు, ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని, హెల్త్ మేళాలు నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటరమణ సూచించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో పల్లె దవాఖానల సేవలపై సిబ్బందితో శుక్రవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఈ–సంజీవని కార్యక్రమం ద్వారా ప్రతిరోజూ కనీసం 15 మందికి టెలి మెడిసిన్ ద్వారా సేవలు అందించాలన్నారు. ప్రోగ్రాం అధికారి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు, భరత్‌కుమార్, దిలీప్, పల్లె దవాఖానల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన మార్కెట్ సెక్రటరీల టూర్

వరంగల్: కేంద్ర మార్కెటింగ్‌శాఖలోని 130వ బ్యాచ్‌కు చెందిన ఏపీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన మార్కెటింగ్ శాఖ అధికారులు, కార్యదర్శులు రెండు రోజుల స్టడీటూర్, శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఏనుమాముల మార్కెట్‌లోని మిర్చి, పత్తి, పసుపు–పల్లికాయ, ధాన్యం–అపరాల యార్డుల్లో జరిగిన క్రయ, విక్రయాలను పరిశీలించారు. అనంతరం మన అగ్రిటిక్‌ను చైర్‌పర్సన్ దిడ్డిభాగ్యలక్ష్మితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మార్కెట్‌లోని పాలనా వ్యవహారాలను ఉన్నత శ్రేణి కార్యదర్శి బీవీ.రాహుల్ వారికి వివరించారు. కార్యక్రమంలో జేడీఎం మల్లేషం, డీడీఎం అజ్మీరా రాజు, డీఎంఓ ప్రసాద్ రావు, డీఎంఐకి చెందిన సీనియర్ మార్కెటింగ్ ఆఫీసర్ ఫణిరాజశేఖర్, మార్కెటింగ్ అధికారి రాఘవేంద్ర, కో–ఆర్డినేటర్ శ్రీనివాస్, గ్రేడ్–2 కార్యదర్శులు బియాబాని, రాము, మార్కెట్ అధికారులు రాజ్‌కుమార్, కృష్ణమీనన్, వెంకన్న, మురళి, శివకుమార్, గంగాధర్, రమణ, స్వప్న పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

నిద్రలోనే గుండెపోటుతో బాలింత మృతి

- ప్రసవించిన 5 రోజులకే ఘటన


సుష్మిత(ఫైల్)

వరంగల్ చౌరస్తా: వరంగల్ సీకేఎం ప్రభుత్వ ప్రసూతి వైద్యశాలలో శుక్రవారం ఉదయం తెల్లవారుజామున గుండెపోటుతో బాలింత మృతి చెందింది. కుటుంబసభ్యులు, వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన బుస్స సుష్మిత (25) మొదటి కాన్పు ప్రసూతి వైద్యసేవల కోసం సీకేఎం హాస్పిటల్‌లో ఈనెల 13 చేరింది. ఆదే రోజు సిజేరియన్ ద్వారా మగశిశువుకు జన్మనిచ్చింది. శిశువు అనారోగ్యంగా ఉండడంతో నవజాత శిశువుల వార్డులోని ఇంక్యుబేటర్లో ఉంచి వైద్యసేవలు అందిస్తున్నారు. తల్లి సుష్మితను ఐసీయూనుంచి 18న ప్రత్యేక వార్డుకు మార్చారు. శుక్రవారం ఉదయం సుమారు 4:30 గంటల సమయంలో సుష్మిత వెళ్లి శిశువుకు పాలు పట్టించి వచ్చి నిద్రపోయింది. తిరిగి రెండు గంటల అనంతరం బాబుకు పాలుపట్టాలని తల్లి నిద్రలేపే ప్రయత్నం చేయగా కదలకపోవడంతో వైద్యులను సంప్రదించారు. డ్యూటీ వైద్యులు వెంటనే పరీక్షించి సీపీఆర్ నిర్వహించినప్పటికీ ఫలితం లేకపోయింది. నిద్రలో కార్డియాక్ అరెస్ట్ కావడంతో సుష్మిత మృతి చెందినట్లు సీకేఎం సూపరింటెండెంట్ డాక్టర్ నిర్మలకుమారి తెలిపారు. మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి ..


పరమేశ్వరచారి (ఫైల్)

వర్ధన్నపేట: ప్రమాదవశాత్తు హెచ్‌టీ విద్యుత్ లైన్ తీగలు తగిలి షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణంలో చోటుచేసుకుంది. వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన రామగిరి పరమేశ్వరచారి(60) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో తన ఇంటిలో విద్యుత్ మరమ్మతు పనులు చేయడంకోసం పట్టణానికి చెందిన బొంత సుధాకర్‌ను కోరాడు. తాను పట్టణంలోనే మరోచోట చంద్రకళ అనే మహిళ ఇంట్లో పనులు చేస్తున్నట్లు చెప్పాడు. దీంతో పరమేశ్వరచారి అక్కడకు వెళ్లి సుధాకర్‌తో మాట్లాడుతున్న క్రమంలో డాబా పైన ఉన్న హెచ్‌టీ లైన్ పీవీసీ పైపుతో ఉన్న విద్యుత్ తీగలకు తన చేయి తాకింది. దీంతో షాక్‌కు గురైన పరమేశ్వరచారిని కర్రతో కొట్టి సుధాకర్ తీగనుంచి వేరుచేశాడు. అనంతరం పరమేశ్వరచారి కుమారుడు శ్యాంప్రసాద్‌తో కలిసి వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే పరమేశ్వరచారి మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. పరమేశ్వరచారికి భార్య భాగ్యలక్ష్మి, కుమారుడు శ్యాంప్రసాద్, కుమార్తెలు స్వాతి, సింధు ఉన్నారు. శ్యాంప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

హడక్ లోకోపైలెట్లు రెగ్యులరైజ్

- ఉత్తర్వులు జారీ చేసిన రైల్వే అధికారులు
- 381 మందికి పోస్టింగ్

కాజీపేట రూరల్: రైల్వే రన్నింగ్ స్టాప్ డిపార్ట్‌మెంట్‌లో హడక్ గూడ్స్ లోకోపైలెట్లుగా పని చేస్తున్న వారిని రెగ్యులరైజ్ చేస్తూ సికింద్రాబాద్ రైల్వే అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ రన్నింగ్ బ్రాంచ్ వర్కింగ్ చైర్మన్ పాక రాజ్‌కుమార్ తెలిపారు. సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో 2019 నుంచి హడక్‌గా గూడ్స్ లోకోపైలెట్లు పని చేస్తున్నారని తెలిపారు. 2021లో రైల్వే జీఎంతో జరిగిన జీఎం పీఎన్ఎం మీటింగ్‌లో రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ జనరల్ సెక్రటరి రాఘవయ్య లోకోపైలెట్లను రెగ్యులరైజ్ చేయాలని ప్రస్తావించినట్లు గుర్తు చేశారు. దీంతో రైల్వే ఉన్నతాధికారులు పరిశీలించి నాలుగు సంవత్సరాల తర్వాత డివిజన్‌లో 381 మంది గూడ్స్ హడక్ లోకో పైలెట్లను రెగ్యులరైజ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. దీంతో కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని సనత్‌నగర్, బెల్లంపల్లి, రామగుండం, డోర్నకల్ జంక్షన్‌లో పని చేస్తున్న ఎక్కడి లోకోపైలెట్లకు అక్కడే పోస్టింగ్‌లు ఇవ్వడం జరిగిందని తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే సంఘ్ జనరల్ సెక్రటరి ఎం.రాఘవయ్య, సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరి డి.భుజంగరావు కృషితోనే హడక్ లోకోపైలెట్ల రెగ్యులరైజేషన్ జరిగిందని, ఇది సంఘ్ విజయంగా భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అరుణాచలానికి బస్సు సౌకర్యం

హన్మకొండ: తమిళనాడులోని అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పిస్తుందని వరంగల్ రీజినల్ మేనేజర్ జె.శ్రీలత తెలిపారు. అరుణాచల గిరి ప్రదక్షిణ చేయాలనుకునే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆమె ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 30న పౌర్ణమిని పురస్కరించుకుని సూపర్ లగ్జరీ బస్సును నడుపనున్నట్లు తెలిపారు. బస్సు ఈ నెల 29న మధ్యాహ్నం 3 గంటలకు హనుమకొండ బస్ స్టేషన్‌లో బయలు దేరుతుందని, 30న ఉదయం కాణిపాకం, మధ్యాహ్నం 1 గంటకు వెల్లూరులోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి దర్శనం అనంతరం సాయంత్రం 7 గంటలకు అరుణాచలానికి చేరుకుంటుందని వివరించారు. భక్తులు సర్వీస్ నంబర్ 92222 బస్సును ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చని తెలిపారు. గిరి ప్రదక్షిణ అనంతరం 31న అరుణాచలం నుంచి బయలు దేరి జోగుళాంబ శక్తి పీఠం సన్నిధికి వెళ్తుందని, ఇక్కడ దర్శనానంతరం హనుమకొండకు బయలు దేరుతుందని వివరించారు. చార్జీ ఒక్కరికి రూ.4,500గా నిర్ణయించినట్లు తెలిపారు. టీఎస్ ఆర్టీసీ వెబ్‌సైట్‌లో, సమీపంలోని ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్లలో రిజర్వేషన్ చేసుకోవచ్చని వివరించారు. ఈ టూర్ ప్యాకేజీకి సంబంధించిన పూర్తి సమాచారం కోసం 99592 26047, 73828 55492 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

'సాక్షి' ఫొటోగ్రాఫర్‌కు అవార్డు


గోవర్ధనం వేణుగోపాల్


బహుమతికి ఎంపికైన ఫొటో

ఆగస్టు 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం పురస్కరించుకుని తెలంగాణ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఇటీవల రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించారు. ఈ మేరకు రవీంద్రభారతిలో మూడు విభాగాలుగా నిర్వహించిన పోటీల్లో శుక్రవారం విజేతలను ప్రకటించారు. ఇందులో జనగామ జిల్లా సాక్షి దినపత్రిక ఫొటోగ్రాఫర్ గోవర్ధనం వేణుగోపాల్ కేటగిరీ–3లో కన్సోలేషన్ బహుమతికి ఎంపికయ్యారు. కాగా, ఈ నెల 20వ తేదీన ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి తన్నీరు హరీశ్ రావు బహుమతి ప్రదానం చేయనున్నారు.

– జనగామ

క్రమశిక్షణతో అత్యుత్తమ ఫలితాలు

- ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి


మాట్లాడుతున్న ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి

హసన్‌పర్తి: క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర పఠనం ద్వారా అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చని ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి అన్నారు. హసన్‌పర్తి మండలం అన్నాసాగరంలోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో బీ.టెక్‌లో మొదటి సంవత్సరంలో అడ్మిషన్ పొందిన విద్యార్థినులకు శుక్రవారం ఒరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సమావేశానికి వరదారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అధ్యాపకులే కాకుండా తల్లిదండ్రులు కూడా తమ పిల్లలపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన విద్యనందించడంలో సుమతిరెడ్డి కళాశాల ముందు వరుసలో ఉందన్నారు. విద్యార్థినులకు వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తూ వారిలో దాగి ఉన్న సృజనాత్మకత, నైపుణ్యాలు వెలికి తీస్తున్నట్లు పేర్కొన్నారు. కళాశాలకు వివిధ కంపెనీలను ఆహ్వానించి క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి విద్యార్థిని ఉద్యోగం పొందేలా బోధన ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సుదర్శన్, డాక్టర్ మహేందర్, ఏఓ వేణుగోపాలస్వామి, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి ఎక్కడ..?

- మోరంచపల్లి వరదలో కొట్టుకుపోయిన మహిళ
- నేటికీ లభ్యంకాని ఆచూకీ
- ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులు


మహాలక్ష్మి(ఫైల్)


ఇంటి ఎదుట దీనస్థితిలో మహాలక్ష్మి భర్త శ్రీనివాస్

భూపాలపల్లి అర్బన్: జూలై 27వ తేదీన కురిసిన భారీ వర్షాల కారణంగా భూపాలపల్లి మండలంలోని మోరంచపల్లి గ్రామాన్ని వరద ప్రవాహం ముంచెత్తిన విషయం తెలిసిందే. ఈ వరద ఉధృతిలో గ్రామానికి చెందిన నలుగురు కొట్టుకుపోయారు. వీరిలో ముగ్గురి మృతదేహాలు లభ్యం కాగా.. గడ్డం మహాలక్ష్మి ఆచూకీ నేటికీ లభ్యంకాలేదు. 22 రోజులుగా పోలీసులు సైతం గాలింపు చర్యలు చేపడుతున్నారు. అయితే వరద ప్రవాహంలో కొట్టుకుపోవడంతో ఇప్పటికే మహాలక్ష్మి మృతిచెంది ఉంటుందని కుటుంబ సభ్యులు సైతం భావిస్తున్నారు. కానీ, కనీసం మృతదేహం అనవాలైన కనిపిస్తుందని ఎదురు చూస్తునారు. మహాలక్ష్మి ఇద్దరు కుమార్తెలు తల్లి గల్లంతు నాటినుంచి తండ్రి శ్రీనివాస్‌కు ధైర్యం చెబుతూ తనవద్దనే ఉంటున్నారు. రెండు వారాల క్రితం మొగుళ్లపల్లి మండలంలో చలివాగు పరివాహక ప్రాంతం, మూడు రోజుల క్రితం ఏటూరునాగారం గోదావరి పరివాహక ప్రాంతంలో రెండు మృతదేహాలు కన్పించాయి. అందులో మహాలక్ష్మి ఆనవాళ్లు లేకపోవడతో కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అందని ఎక్స్‌గ్రేషియా..


వరదలో కొట్టుపోయి చనిపోయిన పేరుతో ప్రభుత్వం రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు ప్రకటించింది. అయితే మృతదేహాలు దొరికిన వారికి మాత్రమే ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నారు. అయితే మహాలక్ష్మి ఆచూకి ఇంకా లభ్యం కాకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు, ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఎక్స్‌గ్రేసియో ఇవ్వాలంటే తప్పనిసరిగా పోస్టుమార్టం రిపోర్టు ఉండాలని అధికారులు చెబుతున్నారు. మహాలక్ష్మి ఇంకా చనిపోయినట్లు నిర్ధారణ కాకపోవడంతో పోస్టుమార్టం రిపోర్ట్ రావడం కష్టం. దీంతో అధికారులు ప్రభుత్వానికి ఎటువంటి నివేదికను పంపించలేదని తెలిసింది.


మిస్సింగ్ కేసు నమోదు చేశాం

మహాలక్ష్మి ఆచూకి కోసం మూడు మండలాల పరిధిలోని వాగులు, చెరువుల వెంట గాలింపు చర్యలు చేపడుతున్నాం. ఎలాంటి ఆనవాళ్లు లభ్యం కాలేదు. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేశాం. ఆరు నెలల వరకు వేసి చూసి కేసు కొట్టివేస్తాం. ఎక్కడైనా మృతదేహాలు కనిపిస్తే వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇస్తున్నాం. వారు కుడా పరిశీలిస్తున్నారు.

– రాంనర్సింహారెడ్డి, సీఐ భూపాలపల్లి

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు


గుడిసెలను తొలగిస్తున్న అధికారులు


కబ్జాదారులకు నోటీసులు ఇస్తున్న తహసీల్దార్

- వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్

వరంగల్: వరంగల్ మండల పరిధిలోని ప్రభుత్వ భూములను ఆక్రమించడం, అందులో నిర్మాణాలు చేపట్టడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై చర్యలు తప్పవని తహసీల్దార్ ఇక్బాల్ హెచ్చరించారు. కాశిబుగ్గ లక్ష్మీపురం భగత్‌సింగ్‌నగర్‌లోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్91, 92లకు చెందిన 28గుంటల సీలింగ్ భూమిని పులి వీరస్వామి, అందే వెంకటేశ్వర్లు, వి.సంజీవరెడ్డిలు అక్రమించి చేపట్టిన నిర్మాణాలను శుక్రవారం ఆయన నిలిపివేశారు. వారికి నోటీసులు జారీ చేసి స్థలం స్వాధీనం చేసుకున్నారు. ఆయనవెంట ఆర్ఐ జలపతిరెడ్డి, సర్వేయర్ సందీప్ తదితరులు ఉన్నారు.

బొందివాగు వెంట గుడిసెల తొలగింపు

వరంగల్ చౌరస్తా: వరంగల్ హంటర్ రోడ్డు బొందివాగు వెంట రెండు నెలల క్రితం వేసుకున్న తాత్కాలిక గుడిసెలను అధికార యంత్రాంగం గురువారం సాయంత్రం తొలగించింది. బల్దియా, రెవెన్యూ, పోలీసు అధికారులు, సిబ్బంది మోహరించి సుమారు 400 గుడారాలను నేలమట్టం చేశారు. ఇళ్ల స్థలాలు లేక, అద్దెలు చెల్లించలేక గుడిసెలు వేసుకున్నామని పేదలు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. అధికారులతో వాగ్వాదానికి దిగారు. నాలా వెంట, ముంపు ప్రాంతాల్లో గుడిసెలు వేసుకోవడం నిబంధనలకు విరుద్ధమని పోలీసులు సీరియస్‌గా హెచ్చరించడంతో వెళ్లిపోయారు. గుడిసెలు తొలగించిన ప్రాంతాన్ని సీపీఎం వరంగల్ జిల్లా కార్యదర్శి రంగయ్య, బాబు సందర్శించారు. గుడిసెలను కూల్చివేయడం అమానుషమని తెలిపారు.

60ఏళ్లు దాటిన రైతులకు పింఛన్ ఇవ్వాలి

వరంగల్: జై జవాన్.. జై కిసాన్ అని నినాదమిచ్చే భారతదేశంలో అమరులైన, రిటైర్డ్ జవాన్ల కుటుంబాలను గౌరవిస్తున్న విధంగానే 60ఏళ్లు దాటిన రైతులందరికీ నెలకు రూ.10వేల చొప్పున పెన్షన్ ఇవ్వాలని, ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగమిచ్చి గౌరవించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని ఏఐకేఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు మర్రెడ్డి వెంకటరెడ్డి అన్నారు. వరంగల్ శివనగర్‌లోని సాయి కన్వెన్షన్ హాల్‌లో రైతు సదస్సు ముగింపు సమావేశంలో శుక్రవారం ఆయన పాల్గొని, మాట్లాడారు. రైతులకు పెన్షన్, పంటలకు గిట్టుబాటు ధరలు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో రైతులు, సాగుదారులకు ఓటు హక్కు, రైతు కుటుంబాలకు ప్రభుత్వ, ప్రైవేట్ విద్య, ఉద్యోగ, వైద్య రంగాల్లో రిజర్వేషన్, వ్యవసాయ రంగానికి ఉపాధి పథకం అనుసంధానం, పసుపు పంటకు రూ.15వేలు, మిర్చికి రూ.30వేలు మద్దతు ధరలు, కౌలు, పోడు రైతులను గుర్తించాలని, రైతులకు రుణాలు మాఫీ చేసి వడ్డీలేని రుణాలు అందించాలని తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో ఏఐకేఎఫ్ జాతీయ అధ్యక్షుడు ప్రేమ్‌సింగ్, నాయకులు సింగతి సాంబయ్య, మోర్తాల చందర్‌రావు, నర్సయ్య, శంకర్‌రావు, ఆనందరావు, గోపాల్, కుమారస్వామి, తిరుపతి పాల్గొన్నారు.